క్లుప్తంగా

పెరటికోళ్ల పంపిణీ



మహిళలకు పెరటికోళ్లను అందజేసిన చల్లా సూర్యప్రకాశ్ రెడ్డి

అవుకు: మండల కేంద్రం అవుకు వైకేపీ కార్యాలయం వద్ద ఎంపీడీఓ అజాంఖాన్, ఉప్పలపాడు గ్రామంలో వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకుడు చల్లా సూర్యప్రకాశ్ రెడ్డి చేతుల మీదుగా శనివారం మహిళలకు పెరటి కోళ్లను పంపిణీ చేశారు. ఒక్కో యూనిట్‌లో 11 కోళ్లు ఉంటాయని, ధర రూ.3150 అని ఏపీఎం విజయగోపాల్ చెప్పారు. ఎనిమిది పెట్టలు, మూడు పుంజులు ఉంటాయని, వివిధ గ్రామాల మహిళలకు 41యూనిట్లను పంపిణీ చేశామన్నారు. కార్యక్రమంలో సీసీలు రవి, భీమేష్, జయమ్మ, అకౌంటెంట్ ఓబులేసు, పాడుపు మహిళలు పాల్గొన్నారు.

కోవెలకుంట్లలో మైఖేల్ గ్యాంగ్ సినీనటులు



అభిమానులతో సినీనటులు

కోవెలకుంట్ల: ఇటీవల విడుదలైన మైఖేల్ గ్యాంగ్ సినీనటులు శనివారం సాయంత్రం కోవెలకుంట్లలో సందడి చేశారు. స్థానిక లక్ష్మీవేంకటేశ్వర థియేటర్‌లో ఈ సినిమాను ప్రదర్శిస్తున్నారు. ఈ మేరకు సినీనటులు సాయి చరణ్ తేజ్, వినయ్, డైరెక్టర్ కిరణ్, నిర్మాత పార్థు రెడ్డి, సినీ పాత్రదారులు శేఖర్, చిరంజీవి, పవణ్, రుచిత తదితరులు థియేటర్‌కు వచ్చి ప్రేక్షకులతో ముచ్చటించారు. సినీనటులు పట్టణానికి రావడంతో అభిమానులతో థియేటర్ ప్రాంగణం కిటకిటలాడింది.

ఇంటింటికీ రేషన్ పంపిణీ చేయాలి



రేషన్ అందజేస్తున్న తహసీల్దార్ దోనీ ఆల్‌ఫ్రెడ్

కొలిమిగుండ్ల: ఎండీయూ ఆపరేటర్లకు తప్పకుండా ఇంటింటికీ రేషన్ అందజేయాలని తహసీల్దార్ దోనీ ఆల్‌ఫ్రెడ్ సూచించారు. శనివారం కొలిమిగుండ్లలో జరుగుతున్న ఇంటింటికీ రేషన్ పంపిణీని ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా కొందరికి తహసీల్దార్ రేషన్ అందజేశారు.ప్రభుత్వ ఆదేశాల మేరకు ప్రతి నెలా రేషన్ కార్డుదారుల ఇళ్ల వద్దకే సరుకులు అందజేయాలన్నారు. చాలా మంది ఆపరేటర్లు వాహనాలను ఇళ్ల వద్దనే ఉంచుతున్నారని తమ దృష్టికి వచ్చిందని, పద్ధతి మార్చుకోకుంటే చర్యలు తప్పవని హెచ్చరించారు.

శ్రీ మద్దిలేటి నరసింహస్వామి ఆదాయం రూ.3,11,475



భక్తులతో కిటకిటలాడుతున్న మద్దిలేటయ్య ఆలయం

బేతంచెర్ల : మండల పరిధిలోని ఆర్ఎస్ రంగాపురం శివార్లో వెలసిన శ్రీ మద్దిలేటి నరసింహస్వామిని దర్శించుకునేందుకు శనివారం వివిధ ప్రాంతాల నుంచి భక్తులు తరలివచ్చారు. దీంతో భక్తులతో ఆలయం కిక్కిరిసిపోయింది. సేవా టికెట్స్, లడ్డు ప్రసాదం, గదుల బుకింగ్, అన్నదానం చందాలు, గండదీపం, విరాళాలు, కల్యాణకట్ట తదితర సేవల ద్వారా రూ.3,11,475 లక్షల ఆదాయం వచ్చినట్లు ఈఓ పాండు రంగారెడ్డి, ఆలయ చైర్మన్ సీతారామచంద్రుడు తెలిపారు. కార్యక్రమంలో ఆలయ పాలక మండలి సభ్యులు లక్ష్మణ్ నాయుడు, తిమ్మారెడ్డి, కృష్ణారెడ్డి పాల్గొన్నారు.

బీమా సాయం అందజేత



మృతుని భార్యకు నగదు అందజేస్తున్న దృశ్యం

బేతంచెర్ల: మండల పరిధిలోని రహిమాను పురానికి చెందిన పులసాని రామాంజనేయ రెడ్డి అనారోగ్యంతో మృతి చెందాడు. ఈ మేరకు శనివారం బాధిత కుటుంబానికి వైఎస్సార్ బీమా తక్షణ సాయం కింద రూ. 10 వేలను సర్పంచ్ ప్రమీలమ్మ, కార్యదర్శి రంగస్వామి, వెల్ఫేర్ అసిస్టెంట్ సాహినా, వైఎస్సార్‌సీపీ నాయకులు శ్రీనాథ్ రెడ్డి, భరత్ రెడ్డి, సూర్యప్రకాశ్ చేతుల మీదుగా అందజేశారు.

ఘనంగా రమణ మహర్షి జయంతి

కోవెలకుంట్ల: మండలంలోని గుళ్లదూర్తిలో వెలసిన సీతారామ ఆశ్రమంలో శనివారం రమణ మహర్షి జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. రామతీర్థసేవ సత్సంగం ఆధ్వర్యంలో రమణ మహర్షి చిత్రపటానికి పూలమాల వేసి గీతాపారాయణం, పూజలు చేపట్టారు.

రేషన్ బియ్యం.. ఇక ఉచితం

- కొత్తసంవత్సరం ప్రభుత్వ కానుక
- 4,97,209 కుటుంబాలకు చేకూరనున్న లబ్ధి



కొచ్చెర్వు గ్రామంలో ఎండీయూ వాహనం ద్వారా రేషన్ బియ్యం పంపిణీ చేస్తున్న దృశ్యం (ఫైల్)

డోన్ రూరల్ : ప్రజా పంపిణీ వ్యవస్థ ద్వారా సరఫరా చేస్తున్న బియ్యాన్ని ఉచితంగా పంపిణీ చేసేందుకు ప్రభుత్వం నిర్ణయించింది. ఇప్పటి వరకు కేజీ బియ్యానికి రెండు రూపాయి వసూలు చేస్తున్న విషయం తెలిసిందే. రాష్ట్ర ప్రభుత్వం పేదలకు నూతన సంవత్సరం కానుకగా ఆ రూపాయి కూడా వసూలు చేయరాదని నిర్ణయించింది. ఏడాది పాటు బియ్యాన్ని పూర్తిగా ఉచితంగా ఇవ్వనుంది. నంద్యాల జిల్లాలో 4,97,209 తెల్లరేషన్ కార్డులు ఉన్నాయి. ఇందులో దాదాపు 15.53 లక్షల మంది సభ్యులు ఉన్నారు. ఒకో సభ్యుడికి ఐదు కేజీల ప్రకారం బియ్యం పంపిణీ చేస్తారు. పేద ప్రజలకు బియ్యం అందజేసేందుకు దాదాపు రూ.83.15లక్షలు ప్రభుత్వం కేటాయించింది. ఈ క్రమంలో బియ్యాన్ని ఉచితంగా ఇస్తుండడంతో పేదలకు పెద్ద ఉపశమనం కలుగనుంది. ప్రజా పంపిణీ వ్యవస్థ ద్వారా కార్డు ద్వారా బియ్యంతో పాటు అరకేజీ చెక్కర, కేజీ కందిపప్పు ఇస్తారు. అరకేజీ పంచదారకు రూ.17, కేజీ కందిపప్పుకు రూ.67 వసూలు చేస్తున్నారు. ఏఏవై కార్డుదారులకు కేజీ పంచదార రూ. 13.50 అందజేస్తున్నారు. కొత్త సంవత్సరం సందర్భంగా రాష్ట్ర ప్రభుత్వం తీసుకున్న నిర్ణయంతో కందిపప్పు, పంచదారలకు మాత్రమే కార్డుదారులు డబ్బులు చెల్లించాల్సి ఉంటుంది.

సంతోషం వ్యక్తం చేస్తున్న పేదలు

ప్రభుత్వం రేషన్ బియ్యం ఉచితంగా అందజేస్తుండడంతో పేదలు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. తమపై రూపాయి భారం కూడా పడకుండా ప్రభుత్వం తీసుకున్న నిర్ణయం అభినందనీయమని పేదలు హర్షం వ్యక్తం చేస్తున్నారు. బియ్యం ఉచితంగా పంపిణీ చేస్తున్న నేపథ్యంలో కార్డుదారులు రెండుసార్లు వేలిముద్రలు వేయాల్సి ఉంటుందని తహసీల్దార్ విద్యాసాగర్ తెలిపారు. బియ్యం కోసం ఓసారి, కంది పప్పు, పంచదారకు మరోసారి వేలిముద్రలు వేయాల్సి ఉంటుందన్నారు.

ఆరోగ్య సమస్యలను నిర్లక్ష్యం చేయొద్దు



చిన్నపాదిళ్ల అంగన్‌వాడీ కేంద్రంలో చిన్నారులతో ముచ్చటిస్తున్న డాక్టర్ నితీష్ కుమార్

ప్యాపిలి: ఆరోగ్య సమస్యలను నిర్లక్ష్యం చేయకూడదని, వెంటనే పీహెచ్‌సీలో సంప్రదించాలని ప్యాపిలి వైద్యాధికారి నితీష్ కుమార్ సూచించారు. స్థానిక బాలికల ఉన్నత పాఠశాలలో శనివారం ఆరోగ్య సూత్రాలపై బాలికలకునాయన అవగాహన కల్పించారు. ఆయన మాట్లాడుతూ తప్పనిసరిగా వ్యక్తిగత పరిశుభ్రత పాటించాలన్నారు. టైఫాయిడ్, మలేరియా, డెంగీ, చికెన్‌గున్యా వంటి సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలన్నారు. కాచి చల్లార్చిన నీటినే తాగాలన్నారు. భోజనానికి ముందు, తర్వాత చేతులను శుభ్రంగా కడుక్కోవాలన్నారు. అనంతరం ఆయన చిన్నపాదిళ్లలోని అంగన్‌వాడీ కేంద్రాన్ని తనిఖీ చేశారు. చిన్నారుల ఆరోగ్యం పట్ల జాగ్రత్తగా ఉండాలని అంగన్‌వాడీ కార్యకర్తకు సూచించారు. కార్యక్రమంలో హెచ్ఎం గురుసిద్దయ్య, ఉపాధ్యాయులు శ్రీనివాసరెడ్డి, హెల్త్ ఎడ్యుకేటర్ రాఘవేంద్ర గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

ఇళ్ల నిర్మాణాలు చేపట్టకుంటే ప్లాట్ల రద్దు



సమావేశంలో మాట్లాడుతున్న తహసీల్దార్ పుష్పకుమారి

కోవెలకుంట్ల: నవరత్నాలు- పేదలందరికీ ఇళ్లు పథకం కింద గృహ నిర్మాణాలు చేపట్టకపోతే ప్రభుత్వం మంజూరు చేసిన పట్టాలు రద్దు చేస్తామని తహసీల్దార్ పుష్పకుమారి హెచ్చరించారు. శనివారం మండలంలోని అమడాల గ్రామంలో ఇళ్ల నిర్మాణాలపై లబ్ధిదారులతో గ్రామసభ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గ్రామానికి చెందిన 113 మందిని అర్హులుగా గుర్తించి ప్రభుత్వ స్థలం లేకపోవడంతో రైతుల భూమిని కొనుగోలు చేసి పట్టాలు ఇచ్చామన్నారు. వీరిలో 51 మందికి మొదటి విడతగా పక్కాగృహాలు కేటాయించినా ఇప్పటి వరకు ఏ ఒక్కరూ ఇంటి నిర్మాణం చేపట్టలేదన్నారు. వారం రోజుల్లో ఇళ్ల నిర్మాణాలు చేపట్టకపోతే పక్కాగృహాలను రద్దు చేయడంతో పాటు ఇంటి పట్టాలను స్వాధీనం చేసుకుంటామని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఎంపీడీఓ మహబూబ్‌దౌలా, ఈఓపీఆర్డీ రాధిక, డిప్యూటీ తహసీల్దార్ చంద్రశేఖర్, ఆర్ఐ ఇమ్రాన్ తదితరులు పాల్గొన్నారు.


భూకమతాల గణన పకడ్బందీగా చేపట్టాలి

బనగానపల్లెరూరల్: వ్యవసాయ భూ కమతాల గణన కార్యక్రమాన్ని రెవెన్యూ సిబ్బంది పకడ్బందీగా చేపట్టాలని డోన్ డివిజన్ ఉపగణంక అధికారి చిదంబరం పేర్కొన్నారు. శనివారం స్థానిక మండల తహసీల్దార్ కార్యాలయంలో 2022-23కు సంబంధించిన భూ కమతాల గణనపై అవగాహన కార్యక్రమం జరిగింది. ఆయన మాట్లాడుతూ భూకమతాల గణన గ్రామాన్ని యూనిట్‌గా తీసుకుని ప్రతి ఐదు సంవత్సరాలకు ఒకసారి మూడు విడతలుగా నిర్వహించడం జరుగుతుందన్నారు. ప్రస్తుతం 11వ వ్యవసాయ గణన చేపట్టడం జరుగుతుందని, గతంలో మ్యానువల్ పద్ధతిలో నిర్వహించామని,ఈ ఏడాది నుంచి కేంద్ర ప్రభుత్వం ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన యాప్‌లో నమోదు చేయాల్సి ఉంటుందన్నారు. అనంతరం సెల్‌ఫోన్ ద్వారా యాప్‌ను ఉపయోగించి వ్యవసాయ గణను ఏవిధంగా చేయాలో వీఆర్‌ఓలకు అవగాహన కల్పించారు.

వ్యక్తి ఆత్మహత్య

అవుకు: మండల కేంద్రం అవుకు ఎంపీడీఓ కార్యాలయ ఆవరణలోని సాంకేతిక గృహం కార్యాలయం పక్కనే ఉన్న చెట్టుకు శనివారం ఉరివేసుకొని ఓ వ్యక్తి ఆత్మహత్యకు పాల్పడ్డారు. ఎంపీపీ చల్లా రాజశేఖర్ రెడ్డి, జెడ్పీటీసీ సభ్యురాలు చల్లా శ్రీలక్ష్మి, సొసైటీ అధ్యక్షుడు చల్లా విజయభాస్కర్ రెడ్డి, మేజర్ గ్రామ పంచాయతీ ఉపసర్పంచ్ చల్లా రఘునాథ్ రెడ్డి ఘటనా స్థలానికి చేరుకొని కుటుంబ సభ్యులను పరామర్శించి మృతికి గల కారణాలను తెలుసుకున్నారు. పోలీసులు తెలిపిన ప్రకారం వివరాలు ఇలా ఉన్నాయి. అవుకు పట్టణంలోని చాకలి పేటకు చెందిన చాకలి మెట్టుపల్లె మద్దిలేటి(50) మద్యానికి బానిస కావడంతో ఆరోగ్యం క్షీణించింది. మూడు నెలల నుంచి మానసికస్థితి తప్పి చనిపోతానంటూ కుటుంబ సభ్యుల వద్ద అంటూ ఉండేవాడు. మృతుని కుమారుడు మెట్టుపల్లె మధు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామని ఎస్ఐ జగదీశ్వర్ రెడ్డి తెలిపారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం బనగానపల్లెకు తరలించి, అనంతరం కుటుంబ సభ్యులకు అప్పగించారు.

విద్యార్థులకు ట్యాబ్‌ల పంపిణీ



ట్యాబ్‌లు పంపిణీ చేస్తున్న వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు గుర్విరెడ్డి

కొలిమిగుండ్ల: మండల పరిధిలోని చింతలాయిపల్లె ఉన్నత పాఠశాల ఎనిమిదవ తరగతి విద్యార్థులకు ప్రభుత్వం మంజూరు చేసిన ట్యాబ్‌లను శనివారం వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు అంబటి గుర్విరెడ్డి పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి విద్యారంగానికి పెద్దపీట వేస్తున్నారని, ఖర్చుకు వెనుకాడకుండా విద్యార్థులకు సకల వసతులు కల్పిస్తున్నారని గుర్తు చేశారు. అనంతరం నాడు-నేడు పనులను పరిశీలించారు. మధ్యాహ్న భోజన పథకాన్ని తనిఖీ చేశారు. కార్యక్రమంలో సర్పంచ్ లక్ష్మినారాయణ, వైఎస్సార్‌సీపీ నాయకుడు అంబటి చంద్రమోహన్‌రెడ్డి, మాజీ ఎంపీటీసీ సభ్యుడు జమరామకృష్ణ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.


వైఎస్సార్ బీమా సొమ్ము పంపిణీ

డోన్ టౌన్: పట్టణానికి చెందిన మహ్మద్‌రఫీ గుండె పోటుతో కొద్దినెలల క్రితం మృతి చెందాడు. ఈ మేరకు వైఎస్సార్ బీమా పథకం కింద మంజూరైన రూ. లక్షను శనివారం మృతుని భార్య షేక్ మాబున్నికి కౌన్సిలర్ ఆర్ట్ రమణ అందజేశారు. కార్యక్రమంలో సచివాలయం సిబ్బంది, వలంటీర్లు తదితరులు పాల్గొన్నారు.

ట్రయల్ రన్ సక్సెస్

డోన్ టౌన్: హంద్రీ నీవా కాలువ నుంచి చెరువులకు నీటి మళ్లింపు కార్యక్రమంలో భాగంగా మండల పరిధిలోని ఉడుములపాడు, జగదుర్తి చెరువులకు శనివారం చేసిన ట్రయల్ రన్ సక్సెస్ అయ్యింది. ఉమ్మడి కర్నూలు జిల్లాలోని 68 చెరువులకు హంద్రీ నీవా కాలువ నుండి నీటి మళ్లింపు కార్యక్రమం గతంలో చేపట్టారు. మండల పరిధిలోని ఇందులో భాగంగా వెంకటాపురం తుమ్మల చెరువుకు ఆరు నెలల కిందటే ట్రయల్ రన్ చేశారు.

మౌలిక వసతులు కల్పిస్తాం



ఇంటి నిర్మాణాలపై అధికారులతో చర్చిస్తున్న నగర పంచాయతీ చైర్మన్ చలంరెడ్డి

బేతంచెర్ల: జగనన్న లేఔట్ కాలనీల్లో మౌలిక వసతులు కల్పిస్తామని తహసీల్దార్ నరేంద్రనాథ్‌రెడ్డి, నగర పంచాయతీ చైర్మన్ చలం రెడ్డి అన్నారు. శనివారం బనగానపల్లె రహదారిలోని జగనన్న లేఔట్‌లో జరుగుతున్న ఇంటి నిర్మాణాలను వారు పరిశీలించారు. గృహ నిర్మాణాలను వేగవంతం చేయాలని, ఎప్పటికప్పుడు బిల్లులు మంజూరు చేయిస్తామని ఈ సందర్భంగా వారు తెలిపారు. కార్యక్రమంలో సర్వేయర్ అన్నారావు, వీఆర్వో గోవిందప్ప తదితరులు పాల్గొన్నారు.

నేడు స్వామివివేకానంద శోభాయాత్ర

డోన్ టౌన్: స్వామి వివేకానంద జయంతిని పురస్కరించుకుని ఆదివారం పట్టణంలోని ఏస్కేపీ హైస్కూల్ నుంచి చేపట్టనున్న శోభాయాత్రను విజయవంతం చేయాలని స్వామి వివేకానంద సేవా సమితి వ్యవస్థాపక అధ్యక్షుడు మలిశెట్టి జగన్‌మోహన్, కార్యదర్శి జోన్నలగడ్డ శ్రీనివాసులు శనివారం తెలిపారు. ఈనెల 12వ తేదీ జయంతి రోజు పలు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు వారు తెలిపారు.

హిందీ భాషపై ఉచిత శిక్షణ

డోన్ టౌన్: హిందీ భాషపై మూడు రోజులపాటు జనవరి 12 నుంచి 14వ తేదీ వరకు ఆన్‌లైన్‌లో ఉచితంగా శిక్షణ ఇస్తున్నట్లు డోన్ డివిజన్ క్రిస్టియన్ జేఏసీ అధ్యక్షుడు ఆదాం శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. అంతర్జాతీయ హిందీ దినోత్సవం జనవరి 10తేదీని పురస్కరించుకుని విశాఖపట్నానికి చెందిన హిమజ్యోతి మినిస్ట్రీస్ ట్రస్ట్ ఈ అవకాశాన్ని కల్పిస్తుందని, ప్రతి విద్యార్థి సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఆన్‌లైన్ రిజిస్ట్రేషన్ కొరకు 8919117343 నెంబరును సంప్రదించాలన్నారు.

11 నుంచి జిల్లా స్థాయి టెన్నిస్‌బాల్ క్రికెట్ టోర్నమెంట్

డోన్ టౌన్: సంక్రాంతి పర్వదినాన్ని పురస్కరించుకుని ఈ నెల 11వ తేదీ నుంచి జిల్లా స్థాయి టెన్నిస్‌బాల్ క్రికెట్ టోర్నమెంట్ నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. పట్టణ సమీపంలోని ఉడుములపాడు రహదారిలో ఉన్న హెచ్‌పీ గ్యాస్ గోడౌన్ వెనుక గ్రౌండ్‌లో పోటీలు నిర్వహిస్తామన్నారు. విజేతలకు మొదటి, రెండవ బహుమతులుగా రూ. 20వేలు, రూ. 10వేలు అందజేస్తామన్నారు. ఆసక్తి కలిగిన టీం సభ్యులు ఈనెల 10వ తేదీలోపు ఎంట్రీ ఫీజు రు.500 చెల్లించి పేర్లు నమోదు చేసుకోవాలన్నారు.

చిరువ్యాపారులను ఆదుకోవాలి

డోన్ టౌన్: రైల్వే అధికారుల తొందరపాటు చర్యల వలన రోడ్డునపడిన చిరు వ్యాపారుల కుటుంబాలను ఆదుకోవాలని సీపీఎం పట్టణ కార్యదర్శి నక్కి శ్రీకాంత్ కోరారు. స్థానిక కార్యాలయంలో శనివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ పేదలు రైల్వేగేట్ల సమీపంలో చిరు వ్యాపారాలు నిర్వహించుకుంటు కుటుంబాలను పోషించుకుంటున్నారని, ముందస్తు సమాచారం ఇవ్వకుండ పోలీసు బలగాలతో భారీ యంత్రాలతో దుకాణాలను ధ్వంసం చేయడం సమంజసం కాదన్నారు. అధికారులు స్పందించి వారికి ప్రత్యామ్నాయ స్థలాలు చూపించాలని, లేనిపక్షంలో ఆందోళనలు చేస్తామని హెచ్చరించారు. సమావేశంలో నాయకులు షమీమ్‌బేగం, అక్బర్‌బాషా, తెలుగు విజయ్ పాల్గొన్నారు.

ఆవాజ్ రాష్ట్ర మహాసభలను జయప్రదం చేయండి



మాట్లాడుతున్న షేక్ అబ్దుల్ రహిమాన్

ప్యాపిలి: ఆవాజ్ కమిటీ రెండో రాష్ట్ర మహాసభలను జయప్రదం చేయాలని డోన్ నియోజకవర్గం ఆవాజ్ కమిటీ ప్రధాన కార్యదర్శి షేక్ అబ్దుల్ రహిమాన్, నాయకులు రహంతుల్లా తెలిపారు. శనివారం ఆయన ప్యాపిలిలో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడుతూ జనవరం 8,9వ తేదీల్లో గుంటూరులో ఆవాజ్ రాష్ట్ర మహాసభలు జరుగనున్నట్లు తెలిపారు. ముస్లింల సమస్యలు ఎక్కడ వేసిన గొంగడి అక్కడే అన్న చందంగా ఉన్నాయని, వక్ఫ్ బోర్డు ఆస్తుల పరిరక్షణ విషయంలో కూడా ప్రభుత్వాలు నిర్లక్ష్యాన్నే ప్రదర్శిస్తున్నాయని ఆరోపించారు.

సంతాపం

డోన్ టౌన్:మండల పరిధిలోని దేవరబండ గ్రామంలోని ప్రాథమికోన్నత పాఠశాల్లో ఎస్‌జీటీగా విధులు నిర్వహిస్తున్న ఉపాధ్యాయుడు దస్తగిరి(42) అనారోగ్యంతో హైదరాబాద్‌లోని మెడికవర్ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ కోలుకోలేక శుక్రవారం మృతి చెందారు. శనివారం స్థానిక ఎస్టీయూ కార్యాలయంలో మండల శాఖ ఆధ్వర్యంలో దస్తగిరి మృతికి రెండు నిముషాలు మౌనం పాటించి సంతాపం తెలిపారు. కార్యక్రమంలో ఆ సంఘం నాయకులు షణ్ముర్తి, ఇక్బాల్, రమణ, మౌలాలీ, శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకోవాలి



సంక్షేమ పథకాల బుక్‌లెట్‌ను లబ్ధిదారులకు అందజేస్తున్న నాయకులు, అధికారులు

ప్యాపిలి: ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఎంపీపీ గోకుల్‌లక్ష్మి, మండల వ్యవసాయ సలహా మండలి చైర్మన్ మెట్టు వెంకటేశ్వర్ రెడ్డి సూచించారు. మండల పరిధిలోని మునిమడుగు గ్రామంలో శనివారం గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహించారు. గడప గడపకు వెళ్లి ప్రభుత్వ పథకాల గురించి ప్రజలకు అవగాహన కల్పించారు. ఆయా కుటుంబాలకు ప్రభుత్వం నుంచి వర్తించిన వివరాల బుక్‌లెట్‌లను లబ్ధిదారులకు అధికారులతో కలిసి నాయకులు అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పేదలందరికీ ఇళ్లు ఉండాలన్న ఉద్దేశంతో ప్రభుత్వం ఇంటి స్థలంతో పాటు, ఇంటి నిర్మాణానికి కూడా ఆర్థికసాయం అందజేస్తోందన్నారు. పేద విద్యార్థులు ఉన్నత విద్యత విద్యనభ్యశించేలా ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక సదుపాయాలను కల్పించడంతో పాటు ఎనిమిదో తరగతి విద్యార్థులకు ట్యాబ్‌లు అందజేస్తోందన్నారు. అమ్మ ఒడి, విద్యా, వసతి దీవెన తదితర పథకాల కింద ప్రభుత్వం అందజేస్తున్న ఆర్థిక సాయంతో తల్లులు తమ పిల్లలను మంచి చదువులు చదివించాలన్నారు. స్థానికంగా నెలకొన్న సమస్యలను అధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేస్తామన్నారు. కార్యక్రమంలో ఏపీఓ వెంకటరమణ, ఏపీఎం కృష్ణమూర్తి, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ రవికుమార్, వైఎస్సార్‌సీపీ నాయకులు భాస్కర్‌నాయుడు, గోపాల్ తదితరులు పాల్గొన్నారు.

ఇళ్ల నిర్మాణాలను పూర్తిచేయాలి



ఇళ్ల నిర్మాణాలను పరిశీలిస్తున్న చైర్మన్ రాజేష్

డోన్ : ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా తలపెట్టిన జగనన్న కాలనీల్లో నిర్మాణాన్ని త్వరితగతిన పూర్తిచేసేందుకు లబ్ధిదారులకు పూర్తి సహాయ సహకారాలు అందజేస్తామని మున్సిపల్ చైర్మన్ సప్తశైల రాజేష్ అన్నారు. మున్సిపల్ పరిధిలో శనివారం ఆయన జగనన్న లేఅవుట్లలో జరుగుతున్న ఇళ్ల నిర్మాణం పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దొరపల్లె, ఉడుములపాడుగ్రామాల లేఅవుట్లలో 3,300 ఇళ్ల నిర్మాణాన్ని చేపట్టామన్నారు. ఇందులో ఇప్పటికే సగానికి పైగా ఇళ్లు నిర్మాణం పూర్తయ్యాయన్నారు. మార్చి 31వ తేదీ నాటికి 50 శాతం ఇళ్ల నిర్మాణాలను పూర్తిచేయాలని ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకున్నందున పూర్తి చేయాలని సూచించారు. ఉడుములపాడు, జగదుర్తి లేఅవుట్లలోని నాలుగు ప్రధాన రహదారుల నిర్మాణానికి రూ.4కోట్లతో ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపినట్లు చైర్మన్ రాజేష్ తెలిపారు. నిధులు మంజూరు కాగానే ప్రధాన రహదారులను నిర్మిస్తామన్నారు. కార్యక్రమంలో కమిషనర్ వెంకటేశ్వర్లు, హౌసింగ్ డీఈ నాగభూషణం, ఏఈ వీరేంద్ర, కౌన్సిలర్ రైల్వే నాగేంద్రలు పాల్గొన్నారు.

జాగ్రత్తలు పాటించాలి

డోన్ రూరల్ : మామిడి సాగు చేసిన రైతులు పూత రాలీపోకుండ తగిన జాగ్రత్తలు తీసుకోవాలని హార్టికల్చర్ అధికారి కళ్యాణి సూచించారు. మండల పరిధిలోని వెంకటాపురంలోని మామిడి తోటలో శనివారం తోటబడి కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా మామిడి సాగులో చేపట్టాల్సిన సస్యరక్షణ చర్యలను ఆమె రైతులకు వివరించారు. అనంతరం రైతులకు లింగాకర్షక బుట్టలను పంపిణీ చేశారు. కార్యక్రమంలోసర్పంచ్ బోయ రాణి, పంచాయితీ సెక్రటరీ నరేష్, ఆర్‌బీకే సిబ్బంది వెంకటరాముడు పాల్గొన్నారు.

సన్మానం

బనగానపల్లెరూరల్: ఫ్యాప్టో నంద్యాల జిల్లా చైర్మన్‌గా ఏకగ్రీవంగా ఎన్నికైన బనగానపల్లె జెడ్పీ ఉన్నత పాఠశాల ఉపాధ్యాయుడు, జిల్లా ఏపీటీఎఫ్ అధ్యక్షుడు మాధవస్వామిని శనివారం హెచ్ఎం దస్తగిరి ఆధ్వర్యంలో ఘనగా సన్మానించారు. కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు రాజునాయక్, నాగరాజు, వరలక్ష్మీ, జరీనాబేగం, సత్యవేదం, స్వర్ణలత, రేణుకాదేవి, కృష్ణారెడ్డి, గౌస్‌మొహీద్దిన్, జాకీర్‌హుస్సేన్ తదితరులు పాల్గొన్నారు.

వేధింపుల కేసు నమోదు

బనగానపల్లె రూరల్: మండలంలోని నందివర్గం పోలీసు స్టేషన్ పరిధిలోని సంకలాపురం గ్రామానికి చెందిన పసుపల మద్దిలేటి కూతురు సువర్ణ తన భర్త, అత్త మామలపై వేధిస్తున్నారని ఫిర్యాదు చేసినట్లు ఎస్ఐ రామాంజనేయరెడ్డి శనివారం తెలిపారు. ఎస్ఐ వివరాల మేరకు సువర్ణకు మహానంది మండలం గోపవరం గ్రామానికి చెందిన గోసుపల ఓబులరాజుతో ఏడాది క్రితం వివాహం జరిగింది. కట్నకానుల కింద ఓబులరాజుకు బంగారం అభరణాలుతో పాటు మూడు లక్షల నగదు ఇవ్వడం జరిగిందన్నారు. వివాహం అయిన కొద్ది రోజుల నుంచే తన భర్త,అత్తమామలు అదనపు కట్నం తీసుకురావాలని సువర్ణను మానసికంగా శారీరకంగా వేధింపులకు పాల్పడుతుండడంతో భయందోళనకు గురై భర్త ఇంటి నుంచి పారిపోయివచ్చి పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

యాజమాన్య పద్ధతులు పాటించాలి

కోవెలకుంట్ల: రబీ సీజన్‌లో విస్తారంగా సాగైన పప్పుశనగ పంటలో రైతులు యాజమాన్య పద్ధతులు పాటించాలని వ్యవసాయాధికారి నిరంజన్ సూచించారు. శనివారం మండలంలోని రేవనూరు గ్రామంలో పొలంబడి కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శనగపంటలో ఎండు, మోదలు, వేరుకుళ్లు తెగుళ్లు, ఆకుముడత, తుప్పు, బూజు తెగులు, పచ్చ, రబ్బరు పురుగు ఆశించే ఆస్కారం ఉందన్నారు. నివారణకు బావిష్టిన్, కాపరాక్సీ క్లోరైడ్, హెక్సాకొనజోల్, ప్రొపికొనజోల్ వంటి క్రిమి సంహారక మందులు పిచికారీ చేయాలని సూచించారు.

అంకితభావంతో విధులు నిర్వర్తించాలి

బేతంచెర్ల: రైతు భరోసా కేంద్రాల అగ్రికల్చర్ అసిస్టెంట్స్ అంకితభావంతో విధుల నిర్వర్తించాలని వ్యవసాయ శాఖ ఏడీఏ అశోక్ వర్ధన్ రెడ్డి తెలిపారు. శనివారం స్థానిక వ్యవసాయ కార్యాలయంలో ఏఓ కిరణ్ కుమార్ ఆధ్వర్యంలో అగ్రికల్చర్ అసిస్టెంట్స్, సిబ్బందికి ఒక్క రోజు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ రైతులకు అందుబాటులో ఉంటూ పథకాలపై అవగాహన కల్పించాలన్నారు. కార్యక్రమంలో హార్టి కల్చర్ అధికారి రఘువరన్, వ్యవసాయ విస్తర్ణ అధికారులు మధు, మహమ్మద్ పాల్గొన్నారు.

స్థల వివాదాన్ని పరిష్కరిస్తా

బేతంచెర్ల: మండల పరిధిలోని ఆర్ఎస్ రంగాపురం గ్రామంలో దర్గా స్థలం వివాదాన్ని పరిష్కరిస్తామని నంద్యాల డీపీఓ శ్రీనివాసులు తెలిపారు. ఈ మేరకు శనివారం ఆ స్థలాన్ని పరిశీలించిన డీపీఓ ఈ వివాదం తన దృష్టికి వచ్చిందన్నారు. ఈ స్థలం తమదంటే తమదని దర్గా నిర్వాహకులు, గ్రామానికి చెందిన రామేశ్వర రెడ్డి మధ్య ఏడాదిగా ఘర్షణలు పడుతున్నారన్నారు. సర్వే చేయించి నిర్ణయం తీసుకుంటామన్నారు. కార్యక్రమంలో ఈఓఆర్డీ వెంకట రంగనాయక్, పంచాయతీ కార్యదర్శి కృష్ణ మూర్తి పాల్గొన్నారు.

రైల్వే స్థలాల్లో ఆక్రమణల తొలగింపు

- డబ్లింగ్ పనుల కోసం చర్యలు చేపట్టిన అధికారులు
- ఆగ్రహించిన బాధితులు



నంద్యాల రైల్వేగేట్ వద్ద ఆక్రమణలను తొలగించిన దృశ్యం

డోన్ : నంద్యాల - గుంతకల్, కర్నూలు - గుంతకల్ రైల్వే సెక్షన్‌ల పరిధిలో డబ్లింగ్ పనుల కోసం రైల్వే స్థలాల్లో ఆక్రమణలను తొలగించేందుకు అధికారులు శనివారం శ్రీకారం చుట్టారు. డోన్ రైల్వేస్టేషన్ మేనేజర్ వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో ఏడీఏ పాపారావు, రైల్వే సర్కిల్ ఇన్‌స్పెక్టర్ వెంకట సుబ్బయ్య, అర్బన్ సీఐ మల్లికార్జున ఆధ్వర్యంలో పెద్ద సంఖ్యలో సిబ్బంది నంద్యాల రైల్వే గేట్ సమీపంలోని గృహాలు, దుకాణాలను కూల్చివేశారు. మరోవైపు కర్నూలు రైల్వేగేట్ నుంచి రైల్వేస్టేషన్ వరకు రైల్వే స్థలంలో ఆక్రమణలో ఉన్న దుకాణాలతో పాటు అంబేడ్కర్ నగర్‌లోని గృహాలను పొక్లెయిన్ సాయంతో తొలగించారు. ఈ సందర్భంగా బాధితుల అభ్యంతరాలను ఏమాత్రం లెక్కచేయకుండా సామాగ్రిని సిబ్బంది బయటపెట్టి గృహాలను కూల్చివేయడంతో బాధితులు లబోదిబోమన్నారు. తమకు ఎలాంటి సమయం ఇవ్వకుండానే ఆక్రమణల పేరుతో గృహాలను, దుకాణాలను కూల్చివేసి తమను వీధుల పాలుచేశారని బాధితులు అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. అయితే రైల్వే డబ్లింగ్ పనులు జరపాల్సి ఉన్నందున స్థలాన్ని ఖాళీ చేయాలని ఏడాదిగా పలుమార్లు నోటీసులు ఇచ్చినా లెక్కచేయకపోవడంతో కూల్చివేయాల్సి వచ్చిందని రైల్వే స్టేషన్ మేనేజర్ వెంకటేశ్వర్లు తెలిపారు. దుకాణాల తొలగింపును సీపీఐ నాయకుడు సుంకయ్య తప్పుపట్టారు. ఏళ్లతరబడి జీవనం సాగిస్తున్న చిరువ్యాపారులు, పేదలకు అన్యాయం చేయడం తగదన్నారు. రైల్వే అధికారులు నష్టపరిహారం చెల్లించి ఆర్థికంగా ఆదుకోవాలని కోరుతూ రైల్వే ఏడీఏ పాపారావుకు వినతిపత్రం అందజేశారు.

ఏడుగురిపై కేసు నమోదు

డోన్ రూరల్ : స్థానిక ఇందిరానగర్ కాలనీకి చెందిన ఏడుగురు యువకులపై శనివారం కేసు నమోదు చేసినట్లు పట్టణ పోలీసులు తెలిపారు. డిసెంబర్ 31న కేక కటింగ్ విషయంలో యువకులు ఒకరిపై ఒకరు దాడికి పాల్పడ్డారన్నారు. బోయ మాధవకృష్ణ, బోయ తరుణ్, వడ్డె రాజు, బోయ భరత్, నల్లబోతుల లక్ష్మిమధన్(మనోజ్), బోయ అశోక్, బోయ బి.సురేపై కేసు నమోదు చేశామన్నారు.